ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 11 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 26 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# మేడిగడ్డ ఏడో బ్లాక్‌ను తొలగించాల్సిందే!



**ప్రభుత్వానికి ఎన్‌డీఎస్‌ఏ నివేదిక**
**కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తుది నివేదిక**
**మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల్లో అన్ని స్థాయిల్లో లోపాలు**
**డిజైన్ మొదలు నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు లోపాలు**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం): మేడిగడ్డ సహా అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి డిజైన్ మొదలు నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు అన్ని స్థాయిల్లోనూ లోపాలు ఉన్నాయని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ స్పష్టం చేసింది. మేడిగడ్డ ఆనకట్టలోని ఏడో బ్లాక్‌ను సురక్షితంగా తొలగించడం లేదా స్థిరీకరణ చేయాలని నిపుణుల కమిటీ సిఫారసు చేసింది. బ్యారేజీలు దెబ్బ తిన్నందున అన్నారం, సుందిళ్ల నుంచి సైతం నీటి మళ్లింపు సురక్షితం కాదని స్పష్టం చేసింది. 3 ఆనకట్టలకు సంబంధించి అన్ని అంశాలను విస్తృతంగా అధ్యయనం చేయాలన్న కమిటీ, భవిష్యత్తులో ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో, ఆ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు సైతం సూచించింది.

ఆ సమస్యలపై అధ్యయనం : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ ఆనకట్ట ఏడో బ్లాక్‌లోని పియర్ కుంగిపోవడంతో పాటు అన్నారం, సుందిళ్ల ఆనకట్టల్లోనూ సమస్యలు తలెత్తడంతో సమగ్ర అధ్యయనం చేసి తగిన సిఫారసులు చేయాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించడంతో పాటు ఉన్నతాధికారులతో సమీక్షించి, పలు దఫాలు సమావేశమై నివేదికను రూపొందించింది. రికార్డులు, డిజైన్లు అన్ని అంశాలను పూర్తి స్థాయిలో పరిశీలించింది. నమూనాలు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు, వివిధ పరీక్షల ఫలితాలను విశ్లేషించి తగిన సిఫారసులు చేసింది. మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో పగుళ్లు ఏర్పడి పియర్స్ దెబ్బతినడం, కుంగడం, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల్లో సీపేజ్, ఇతర సమస్యలపై కమిటీ అధ్యయనం చేసింది.

భూకంప పరీక్షలు అసంపూర్ణ : ప్రాథమిక నివేదిక ఇచ్చిన కమిటీ 2024 వర్షాకాల సీజన్‌కు ముందు తాత్కాలిక భద్రతా చర్యలు చేపట్టాలని, ..మిగతా 2లో



# పాక్ పౌరుల జాబితా పంపండి

**రాష్ట్రాల సిఎంలకు అమిత్ షా ఆదేశం**
**అటారీ-వాఘా సరిహద్దుకు పాక్ పర్యాటకులు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం): ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాక్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాలను కోరారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల తో ఆయన శుక్రవారం మాట్లాడారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి పంపించాలని కోరారు. అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాక్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశాలను కల్పించారు. ఈ ప్రోగ్రామ్ కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు పోటా పోటీగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అలాంటి వేళ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులను వెంటనే వెనక్కి పంపాలని కేంద్ర ..మిగతా 2లో



# పాక్ పౌరులు దేశం విడిచి వెళ్లాలి

**ప్రకటన విడుదల చేసిన డిజిపి**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం): తెలంగాణలో వీసాలతో ఉన్న పాక్ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లాలని, లేకుంటే చటంటప్రకారం చర్యలు తప్పవని డిజిపి హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాకిస్తాన్‌ను అన్ని రకాలుగా దెబ్బ కొట్టడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా పాకిస్తానీల వీసాలను రద్దు చేసింది. 48 గంటల్లో పాకిస్తానీలు దేశం వదలి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఇక, తెలంగాణ పోలీసులు శాఖ కూడా వీసాల రద్దు నేపథ్యంలో రాష్ట్రంలో ఉంటున్న పాకిస్తానీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో ..తెలంగాణలో ఉన్న పాకిస్తానీలు వెంటనే తమ దేశానికి వెళ్లిపోవాలి. పాకిస్తానీల వీసాలు 27 తర్వాత పనిచేయవు.

# పీవోకేను భారత్‌లో కలపాలి

**మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి: సీఎం రేవంత్ రెడ్డి**
**పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ సీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ**
**పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన**
**పీవోకేను భారత్‌లో కలపాలన్న రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం): ఉగ్రవాదం నిర్మూలనలో కేంద్రానికి సంపూర్ణ మద్దతిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందిరాగాంధీని గుర్తుకు తెచ్చుకుని పాక్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పి పీవోకేను భారత్‌లో కలపాలని ఆయన సూచించారు. ఇవాళ సాయంత్రం పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

ఉగ్రదాడిలో చనిపోయిన వారికి నివాళులు : ఈ ర్యాలీలో కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షిద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీ విజయశాంతి, వీహెచ్, దానం నాగేందర్, షబ్బీర్ అలీ, బల్మూరి వెంకట్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు సైతం ఈ ర్యాలీలో పాల్గొని ఉగ్రదాడిలో చనిపోయిన వారికి నివాళులు అర్పించారు.

ఆ కుటుంబాలకు అండగా నిలబడతాం : ఇలాంటి ఘటనలు పునరావృతం కావద్దంటే భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రానికి సూచించారు. 140 కోట్ల మంది భారతీయులు పహల్గాం దాడిని ఖండించాలని ఏఐసీసీ పిలుపునిచ్చిందని, దేశ రక్షణ కోసం భారతీయులంతా ఏకమై రాజకీయాలు, పార్టీ ..మిగతా 2లో



**రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని**
# చాటి చెప్పాం

**భారత్ సమ్మిట్‌తో ప్రపంచానికి దిశానిర్దేశం**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం): భారత్ సమ్మిట్ ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రపంచానికే దిశానిర్దేశం చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. భారత్ సమ్మిట్ కార్యక్రమం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. అహింస, సత్యం, సామాజిక న్యాయం అనే మూడు ప్రాథమిక మూల సిద్ధాంతాలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ భారత్ సమ్మిట్ నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా లింగ సమానత్వం, న్యాయం, ఫెమినిస్ట్ ఫ్యూచర్, ఫ్యాక్ట్ వర్సెస్ ఫిక్షన్, కౌంటరింగ్ డిస్ ఇన్ఫర్మేషన్, యూత్ అండ్ పాలిటిక్స్ ఆఫ్ టుమారో, షేపింగ్ న్యూ మల్టీ ల్యాటరీజం తదితర అంశాలపై 100 దేశాల ప్రతినిధులు లోతైన చర్చ చేశారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి భారత్ సమ్మిట్ ద్వారా ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. క్లీన్ అండ్ ..మిగతా 2లో

# దేశాన్ని చీల్చడమే ఉగ్రవాదుల లక్ష్యం



**ఉగ్రవాదం తుదముట్టించేందుకు సంఘటిత పోరాటం**
**శ్రీనగర్‌లో మీడియాతో రాహుల్**

శ్రీనగర్, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం): పహల్‌గామ్ ఉగ్ర దాడి వెనుక వ్యూహం దేశ ప్రజలను చీల్చడం అని, ఉగ్రవాదాన్ని శాశ్వతంగా ఓడిరచేందుకు భారత్ సంఘటితంగా నిలవడం తప్పనిసరి అని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఉద్ఘాటించారు. 'అది దుర్భర విషాదం. ఏమి జరుగుతోందో తెలుసుకుని, సాయం చేయడానికి ఇక్కడికి వచ్చాను. జమ్మూ కాశ్మీర్ ప్రజలు అందరూ ఈ భీకర దాడిని ఖండిరచారు. వారు దేశానికి పూర్తి మద్దతు ప్రకటించారు' అని రాహుల్ శ్రీనగర్‌లో విలేకరులతో చెప్పారు. శుక్రవారం ఉదయం శ్రీనగర్ చేరుకున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ క్షతగాత్రుల గురించి వాకబు చేయడానికి బాదామిబాఫ్న్ కంటోన్మెంట్‌లో ఆర్మీ 92 బేస్ ఆసుపత్రిని ..మిగతా 2లో

# ఇస్రో శాస్త్రవేత్త కస్తూరిరంగన్ కన్నుమూత



బెంగళూరు, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం): ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్(84) కన్నుమూశారు. బెంగళూరులోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు కృష్ణస్వామి కస్తూరి రంగన్. కేరళలోని ఎర్నాకులంలో ఆయన జన్మించారు. ముంబై యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసిన రంగన్.. అహ్మదాబాద్ ఫిజికల్ రీసెర్చ్ లాబోరేటరీ నుంచి 1971లో డాక్టరేట్ అందుకున్నారు. 1990 నుంచి 1994 వరకూ ఆయన యూఆర్‌ఎసి డైరెక్టర్‌గా పని చేశారు.




## ఉగ్రదాడులను నిరసిస్తూ క్రొవొత్తుల నిరసన ర్యాలీ

**ర్యాలీలో పాల్గొని సంతాపం వ్యక్తం చేసిన...**
**జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ...**
**మున్సిపల్ మాజీ చైర్మన్ బి.ఎస్.కేశవ్...**

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25(ప్రభాత ఉదయం) కాశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడులను నిరసిస్తూ జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఏఐసిసి, టిపిసిసి పిలుపు మేరకు జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సరితమ్మ...మున్సిపల్ మాజీ చైర్మన్ బి.ఎస్.కేశవ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం క్రొవొత్తులతో నిరసన వ్యక్తం చేశారు.పాత బస్టాండు నుండి క్రిష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు..ఈ సందర్భంగా సరితమ్మ మాట్లాడుతూ కాశ్మీర్ లోని పహల్గ%శీ% లో ఉగ్రవాదులు పర్యాటకులను 27 మందిని పొట్టన పెట్టుకున్న ఘటనను నిరసిస్తూ,కాశ్మీర్ ఘటనను ముక్తకంఠంతో ఖండించారు.ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు... ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఇసాక్, సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు,డిటిడిసి నర్సింహులు, శ్రీనివాస్ గౌడ్,భాస్కర్ యాదవ్,పెద్దపల్లి అల్వాల రాజశేఖర్ రెడ్డి,డి.ఆర్.శ్రీధర్, లత్తిపురం వెంకట్రామిరెడ్డి,పులిపాటి వెంకటేష్,శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్,పాతపాలెం ఆనంద్ గౌడ్,సురేష్,జమ్మిచేడు ఆనంద్,టిఎన్ఆర్ జగదీష్, వెంకటస్వామి ఆచారీ,మహేష్, కౌసర్ బేగ్, సామి,మ్యడం రామకృష్ణ, తిమోతి, నాగరాజు,కృష్ణయ్య గౌడ్, బంగి నవీన్,నారాయణ,రాజారెడ్డి,సతీష్,దడవాయి నర్సింహులు,మద్దిలేట్టి,కృష్ణయ్య యాదవ్,రాముడు,భాస్కర్, కీఫాయిత్,మనోజ్,హాఫీజ్ తదితరులు ఉన్నారు.



## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రగతి భవనానికి బయలుదేరిన కార్మికులు

కొత్తకోట గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారంగా నెలకు 18000 ఇవ్వాలని కోరుతూ శుక్రవారం నాడు చలో హైదరాబాద్ ప్రగతి భవనానికి తరలి వెళ్లడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ మండ్ల రాజు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ తెలిపారు గ్రామపంచాయతీ కార్మికులకు నెలనెలా వేతనాలు చెల్లిస్తామని ప్రకటించిన నెలల తరబడి పెండింగ్లో ఉన్నాయని వారు చెప్పారు పారిశుద్ధ పనులు అధికంగా ఉన్నాయని పని భారం ఎక్కువైనా వేతనాలు మాత్రం చాలీచాలని అందిస్తున్నారని వారు చెప్పారు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు హనీప్ రాములు నారాయణ పుల్లయ్య శారదమ్మ శాంతమ్మ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



## మల్కాజిగిరిలో మూడవ రోజు చెట్టు కిందనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

మల్కాజిగిరి, ఏప్రిల్ 25(ప్రభాత ఉదయం) మల్కాజిగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లేకపోవడం వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడానికి వినూత్నంగా నిరసన తెలిపారు స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి. జీహెచ్ఎంసి కార్యాలయం ఎదుట ఉన్న చెట్టు కింద కూర్చొని ప్రజలతో కలిసి ఎమ్మెల్యే ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ఒక శాశ్వత క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, అధికారుల వద్ద విజ్ఞప్తులు చేసినా ఎలాంటి స్పందన లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చెట్టు కిందే తాత్కాలికంగా క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు స్వయంగా విని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. తమ బాధలు చెప్పుకునేందుకు ఎక్కడికి వెళ్లాలో తెలియక సందిగ్ధంలో ఉన్న మల్కాజిగిరి ప్రజలకు ఇది కొంత ఊరట కలిగించిన విషయమైంది. అదేవిధంగా నేరేడ్మెట్ డివిజన్ కు చెందిన ఆరుగురికి రూ.2,00,500 ,వినాయక నగర్ కు చెందిన 9 మందికి రూ.4,01,500, గౌతమ్ నగర్ డివిజన్ కు చెందిన ఏడుగురికి రూ.2,38,500 మొత్తం 22 మంది లబ్ధిదారులకు రూ.8,60,500 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ బి ఆర్ ఎస్ ముఖ్య నాయకులతో కలిసి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, రావుల అంజయ్య, జేఏసీ వెంకన్న , మురుగేష్, జీకే హనుమంతరావు, రాము యాదవ్, అమినుద్దీన్, శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా .. మహిళ మృతి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం)ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన గురువారం గద్వాల మండలం జమ్మిచేడు గ్రామ శివారులో జరిగింది. గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల మండలం లత్తిపురం గ్రామానికి చెందిన కలిమి పావని(30)తన భర్త కలిమి శంకరన్నతో కలిసి ట్రాక్టర్ పై వెంకటోని పల్లి గ్రామానికి బయలుదేరారు. అక్కడ ట్రాక్టర్ లో కంకర నింపుకొని తిరిగి గ్రామానికి వెళ్లుతుండగా ట్రాక్టర్ డ్రైవర్ సురేందర్ ట్రాక్టర్ ను అతివేగంగా నడపడంతో మార్గమధ్యలో జమ్మిచెడు గ్రామ శివారులో 9వ కాలువ దగ్గర కప్పల రాముడు పొలం సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాలీలో కూర్చున్న పావని కి ట్రాలీ డోర్ తల మీద పడటంతో తల పగిలి ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మేడిగడ్డ ఏడో బ్లాక్‌ను తొలగించాల్సిందే!

మొదటి పేజీ తరువాయి...



సాంకేతిక పరీక్షలు చేయాలని సూచించింది. అయితే వాటిని పూర్తిగా, సమర్థవంతంగా అమలు చేయలేదని కమిటీ ఆక్షేపించింది. సాంకేతిక పరీక్షలు పూర్తి కాకముందే గ్రౌటింగ్ చేయడంతో నిర్దిష్ట కారణాల అంచనాకు ఆటంకం ఏర్పడిందని ఫాలో-అప్ డ్రిల్లింగ్ లేకపోవడంతో జీపీఆర్, ఈఆర్టీ, భూకంప పరీక్షలు అసంపూర్ణం అయ్యాయని వివరించింది.

డిజైన్లు మార్చారు : ఆనకట్టల డిజైన్ మొదలు నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు అడుగడుగునా లోపాలు, ఉల్లంఘనలు ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. డిజైన్, హైడ్రాలిక్ నమూనాలు, గేట్ ఆపరేషన్‌లు సరిగా లేవని ఎనర్జీ డిసిపియేషన్, గేట్ సీట్ పొజిషనింగ్‌లో డిజైన్ లోపాలు ఉన్నాయని పేర్కొంది. మోడల్ స్టడీస్ సరిగ్గా జరగలేదని, హైడ్రాలిక్ - స్ట్రక్చరల్ డిజైన్ సరిపోలేదని తెలిపింది. కేంద్ర జలసంఘం పరిశీలనలో డీపీఆర్ ఉండగానే బ్యారేజీల నిర్మాణం ప్రారంభమైందని, ముందస్తు జియోటెక్నికల్ అధ్యయనాలు లేకుండా అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణ ప్రాంతాలు, డిజైన్లను మార్చారని పేర్కొంది. బ్యారేజీల నిర్మాణంలో నీటిపారుదల శాఖ ఉల్లంఘనలకు పాల్పడిందని తేల్చింది. ఆనకట్టల నిర్వహణ, మాన్యువల్‌లు సరిగ్గా లేకపోవడం వల్ల మొదటి ఏడాదిలోనే సమస్యలు తలెత్తాయని మరమ్మతులు సైతం వెంటనే చేపట్టలేదని నిపుణుల కమిటీ తెలిపింది. 2012 డ్యాం సేఫ్టీ చట్టాన్ని ఉల్లంఘించినట్లు స్పష్టం చేసింది. బ్యారేజీలో నిర్వహణ లోపాలు సమస్యలు తెచ్చిపెట్టాయని, డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని పాటించకపోవడంతో మరింత పెరిగాయని కమిటీ అభిప్రాయపడింది.

మేడిగడ్డ బ్యారేజీలో పైపింగ్, నాణ్యత లేని సీకెంట్ ఫైల్ కటాఫ్‌ల కారణంగా ఏడో బ్లాక్ దెబ్బతినట్లు, అన్నారం, సుందిల్లలోనూ బలహీనమైన నిర్మాణం, సరిగ్గా లేని కటాఫ్ గోడల డిజైన్ వల్లే సమస్యలు తలెత్తినట్లు గుర్తించింది. సీకెంట్ ఫైల్ కటాఫ్స్‌లో నాణ్యత లేకపోవడమే పియర్ కుంగడానికి కారణమన్న కమిటీ నాణ్యతా లోపం వల్లే ఎగువ, దిగువన కటాఫ్ సిస్టంలో వైఫల్యం జరిగిందని స్పష్టం చేసింది. బలహీనమైన ఆర్‌సీసీ, పీసీసీ ఫైల్స్, రాఫ్ట్ కనెక్షన్, నాణ్యత లేని నిర్మాణం కారణంగా ఇబ్బందులు వచ్చినట్లు పేర్కొంది. డిజైన్, నిర్మాణం సరిగా లేకపోవడం వల్లే సమస్యలు తలెత్తాయని తెలిపింది. అన్ని బ్యారేజీలకు కటాఫ్ వాల్ అంశాలు ఆందోళనకరంగా ఉన్నాయని,

భద్రత కోసం సమష్టిగా చర్యాలు : బ్యారేజీల్లోనీ ఇతర బ్లాక్‌లలో భవిష్యత్తులో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. మేడిగడ్డలోని అన్ని బ్లాక్‌లను పూర్తిస్థాయిలో పరీక్షించాలని తెలిపింది. మూడు ఆనకట్టల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం అవసరమన్న కమిటీ జియోటెక్నికల్, జియోఫిజికల్, హైడ్రాలిక్, స్ట్రక్చరల్ పరీక్షలు పక్కాగా చేయాలని పేర్కొంది. తక్షణ మరమ్మతులు చేపట్టాలని, మూడు బ్యారేజీలకు సమగ్ర పునర్నిర్మాణ డిజైన్ అవసరమని పేర్కొంది. దీర్ఘకాలిక భద్రత కోసం అన్ని విభాగాలు సమష్టిగా చర్యలు చేపట్టాలని నిపుణుల కమిటీ సూచించింది.

మేడిగడ్డ ఆనకట్ట ఏడో బ్లాక్ పియర్స్‌కు పగుళ్లు, కుంగిన నేపథ్యంలో ఆ నిర్మాణాలను గేట్ల ఆపరేషన్ కోసం ఉపయోగించరాదని కమిటీ సిఫార్సు చేసింది. పక్క బ్లాకులు దెబ్బతినకుండా ఏడో బ్లాకును తొలగించాలని లేదంటే స్థిరీకరించాలని తెలిపింది. దెబ్బతిన్న సీకెంట్ ఫైల్స్‌ను పునరుద్ధించడం లేదా గ్రౌటింగ్ చేయాలని సూచించింది. నాణ్యత కోసం డయాఫ్రమ్ వాల్ రకాన్ని ఎంచుకోవచ్చని పేర్కొంది.

నీటిని మళ్లించడం సురక్షితం కాదు : రాఫ్ట్ కింద ఉన్న గోతులను పూడ్చాలని, ఈ క్రమంలో బ్యారేజీ ఫౌండేషన్ దెబ్బతినకుండా మళ్లీ స్ట్రక్చరల్ అనాలిసిస్ చేయాలని తెలిపింది. ఏడో బ్లాక్ కోసం కొత్త నిర్మాణం, డెక్ స్లాబ్, ఎనర్జీ డిసిపియేషన్ ఆరేంజ్‌మెంట్ ప్రత్యేకంగా విశ్లేషించాలని పేర్కొంది. అన్నారం, సుందిల్ల బ్యారేజీలకు సైతం నష్టం జరిగినందున వాటి ద్వారా నీటిని మళ్లించడం సురక్షితం కాదని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది.

భవిష్యత్తులో ప్రాజెక్టులకు సంబంధించి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం నిపుణుల కమిటీ నివేదికలో సూచించింది. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు, బ్యారేజీలు నిర్మించినప్పుడు జియో టెక్నికల్ పరీక్షలు సమగ్రంగా నిర్వహించాలని తెలిపింది. అన్ని కోణాల్లో, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని నమూనా అధ్యయనాలు, విశ్లేషణలు పక్కాగా జరగాలని ఖచ్చితమైన సమాచారంతో ప్రక్రియ చేపట్టాలని సూచించింది. ప్రాజెక్టు డిజైన్లు, డేటా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టు ప్లానింగ్, ఇన్వెస్టిగేషన్స్‌లో సీడీవో పాత్ర లేదని తెలిసిందని, అది సరికాదని వెల్లడించింది.

క్వాలిటీ కంట్రోల్ బలోపేతం : నిర్మాణం జరుగుతున్నప్పుడూ సీడీవో యూనిట్ సహా అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని తెలిపింది. పనుల గడువులను దృష్టిలో ఉంచుకొని ఆమోదించిన నిర్మాణ విధానం విషయంలో ఎట్టి పరిస్థితులను రాజీ పడరాదని పేర్కొంది. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడొద్దన్న నిపుణుల కమిటీ క్వాలిటీ కంట్రోల్ విభాగం పూర్తి స్వతంత్రంగా ఉండాలి తప్ప ఒకరి కింద పని చేస్తున్న విధానం సరికాదని స్పష్టం చేసింది. క్వాలిటీ కంట్రోల్ విభాగానికి తగిన సిబ్బందిని ఇచ్చి బలోపేతం చేయాలని సూచించింది.

ప్రాజెక్టు పనుల పురోగతి, నాణ్యత పరిశీలనకు థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ విధానం ఉండడం మంచిదని దాన్ని పరిశీలించాలని సూచించింది. ప్రతి ప్రాజెక్టుకు విధిగా నిర్వహణ మాన్యువల్స్ ఉండాలని వాటిని కచ్చితంగా పాటించేలా చూడాలని తెలిపింది. అన్ని రకాల మోడల్స్ చేసేలా ఇంజనీరింగ్ రీసెర్చ్ లాబరేటరీని బలోపేతం చేయాలని సిఫారసు చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలు డ్యాం సేఫ్టీ చట్టం కింద ఉన్నందున అందులోని నిబంధనలు పూర్తిగా అమలు అయ్యేలా చూడాలని తెలిపింది. అన్ని ప్రాజెక్టులకు సంబంధించి నిర్వహణ, నిఘా, తనిఖీ తదితరాలన్నీ పక్కాగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ సూచించింది.

# రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని చాటి చెప్పాం

మొదటి పేజీ తరువాయి...

గ్రీన్ న్యూ ఎనర్జీ పాలసీ ద్వారా 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, రీజినల్ రింగ్ రోడ్ ఔటర్ రింగ్ రోడ్డు మధ్య ఏర్పాటు చేస్తున్న క్లస్టర్స్, ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, నాలెడ్జ్ ఐటీ సెంటర్, ఇందిరా గిరి జల వికాసం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు, రాజీవ్ యువ వికాసం తదితర పథకాల గురించి ప్రతినిధులకు వివరించామన్నారు. దేశానికే రోల్ మోడల్‌గా నిలవబోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా ప్రతినిధులను కోరినట్టు భట్టి చెప్పారు. భారత్ సమ్మిట్-2025 శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. హెచ్ఐసీసీ నోవాటెల్‌లో జరుగుతున్న ఈ సమ్మిట్‌కు 100కు పైగా దేశాల నుంచి దాదాపు 450 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు అందరికీ తెలిసేలా ప్రత్యేక స్టాల్స్‌తో పాటు కాంగ్రెస్ చరిత్రను తెలిపేలా కాంగ్రెస్ గాంధీజీ నూలు వడికే చరాఖాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పలువురు కాంగ్రెస్ అభిమానులు ఈ చరఖాలను తిప్పుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీలు, చామలకిరణ్ కుమార్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీలు మహేశ్ కుమార్ గౌడ్, విజయశాంతి, బల్మూరి వెంకట్‌తో పాటు ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, దిగ్విజయ్ సింగ్, గుర్జీప్ సింగ్ తదితరులు హాజరయ్యారు. పెహల్గాంలో కాల్పులకు నిరసనగా, బాధితులకు సంఘీభావంగా ఏఐసీసీ పిలుపు మేరకు కొవ్వొత్తుల ప్రదర్శనకు ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్‌లో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్ సమ్మిట్‌లో భాగంగా పలు కార్యక్రమాలు నేటికి వాయిదా పడ్డాయి. కేంద్రం ఈ రోజు సంతాప దినంగా ప్రకటించడంతో కార్యక్రమాలు వాయిదా వేశారు. శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి చేయాల్సిన హైదరాబాద్ డిక్లరేషన్ సైతం నేటికి వాయిదా పడింది. ఈ సమ్మిట్లో టెర్రరిజంపై డిక్లరేషన్ ఉంటుందని సీఎం తెలిపారు. భారత్ సమ్మిట్ హైదరాబాద్‌లో జరగడం గర్వకారణమని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సామాజిక న్యాయం, ప్రగతిశీల విలువల ప్రచారంలో తెలంగాణ నాయకత్వాన్ని ప్రపంచానికి చాటి చెబుతోందన్నారు. సామాజిక, ఆర్థిక, పర్యావరణం తదితర సమస్యలపై దృష్టి సారించామన్నారు.



# మంచినీటి సమస్యతో అల్లాడుతున్న మల్లాపురం గ్రామ ప్రజలు

## గ్రామంలో నీళ్ల కోసం తండ్లాట

కేటిదొడ్డి, ఏప్రిల్ 25(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండ లం మల్లాపురం గ్రామంలో నాలుగు రోజులుగా తాగునీటి ఎద్దడితో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ఉన్న మిషన్ భగీరథ ట్యాంకుకు నీళ్లు రాకపోవడంతో పలు వార్డుల్లో నాలుగు రోజుల నుంచి తాగునీళ్ల కోసం పడరాని పట్లు పడుతున్నామని ఆయా వార్డుల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుసార్లు అధికారులకు విన్నవించినా తమ గోడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. . ప్రభుత్వం, మిషన్ భగీరథ అధికారులు స్పందించి నీటి ఎద్దడిని పరిష్కరించాలని కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ని వివరణ కోరగా.. మిషన్ భగీరథ నీళ్లు తక్కువ రావడంతో కొన్ని కాలనీలోకి వాటర్ కొరత ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా బోరు మోటార్ రిపేరు చేసి తాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# పాక్ పౌరుల జాబితా పంపండి

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకొంది. దాంతో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా.. శుక్రవారం దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయన స్వయంగా ఫోన్ చేసి.. వారికి ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. మీ మీ రాష్ట్రాల్లో నివసిస్తున్న పాకిస్థానీయులను గుర్తించి.. వారిని వెంటనే పాకిస్థాన్ పంపాలని సూచించారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందని భారత్ తగిన ఆధారాలను సేకరించింది. అందుకు సంబంధించిన ఆధారాలను ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన విదేశీ కార్యదర్శులకు భారత విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ అందజేశారు. మరోవైపు భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్థానీయులు 48 గంటల లోపు దేశం విడిచి వెళ్లాలంటూ ఆదేశించింది. దీంతో ఇప్పటికే భారత్‌లో వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న పాకిస్థానీయులు.. స్వదేశం వెళ్లేందుకు అటారీ సరిహద్దు వద్ద క్యూ కట్టారు.

# దేశాన్ని చీల్చడమే ఉగ్రవాదుల లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

సందర్శించారు. 'క్షతగాత్రుల్లో ఒకరిని పరామర్శించాను. తక్కినవారు వెనుకకు వెళ్లిపోయినందున వారిని కలుసుకోలేకపోయాను. కుటుంబ సభ్యులను కోల్పోయిన ప్రతి ఒక్కరికీ నా సానుభూతి. దేశం సంఘటితంగా నిలుస్తున్నదని ప్రతి ఒక్కరికీ తెలియాలని అనుకుంటు-న్నా' అని రాహుల్ చెప్పారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశం గురించి రాహుల్ ప్రస్తావిస్తూ, మొత్తం ప్రతిపక్షాలు ఉగ్ర దాడిని ఖండిరచాయని, ప్రభుత్వానికి దన్నుగా ఉన్నాయని తెలిపారు. రాహుల్ జెకె లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కూడా కలుసుకున్నారు. పహల్‌గామ్‌లో పరిణామాల గురించి ఆయనకు వారిద్దరు వివరించారు. 'మా పార్టీ వారికి మద్దతు ఇవ్వబోతున్నదని వారిద్దరికీ హామీ ఇచ్చాను' అని రాహుల్ తెలియజేశారు. రాహుల్ అంతకుముందు వర్తకుల ప్రతినిధివర్గాన్ని, విద్యార్థుల నాయకులను, పర్యాటక రంగానికి సంబంధించినవారిని కలుసుకున్నారు.

# పీవోకేను భారత్‌లో కలపాలి

మొదటి పేజీ తరువాయి...

సిద్ధాంతాలను పక్కనపెట్టి ఉగ్రవాదంపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ఏర్పాటు చేసి అందరిని ఆహ్వానించినట్లు తెలిపారు. చనిపోయిన కుటుంబాలకు సానుభూతి తెలపడమే కాకుండా, వారికి మనమంతా అండగా ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆ కుటుంబాలకు అండగా నిలబడతామని ఆయన ప్రకటించారు.

# నేడు మైలార్దేవ్పల్లి, గగన్ పహాడ్, శివరాంపల్లి, నార్సింగి, ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్/గండిపేట, ఏప్రిల్ 25() (ప్రభాత ఉదయం) శివరాంపల్లి విద్యుత్తు సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాల అంతరాయం ఉ ంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు. రిసెప్షన్ పరిధిలోని శ్రీదేవి కాలనీ విద్యుత్తు ఫీడర్ పరిధిలో ఉ దయం 9:30 నుండి 10 గంటల వరకు శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీ, యూనివర్సిటీ, పిల్లర్ నెంబర్ 258 ప్రాంతం, ఖాద్రి హిల్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



### గగన్ పహాడ్...

గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుండి 8:30 వరకు జై భవాని విద్యుత్ ఫీడర్ , పి రబ్బర్ విద్యుత్ ఫీడర్ , మెట్రో మాల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన శాతం రాయి పారిశ్రామిక వాడ, మెట్రో మాల్ వెనక ప్రాంతం, గగన్ పహాడ్ గ్రామం, పద్మశాలి పురం విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

### మైలార్దేవ్ పల్లి లో..

మైలార్దేవ్పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పల్లె చెరువు, బండ్లగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం తొమ్మిది గంటల నుండి 10 గంటల వరకు ఐయేషా కాలనీ, అలీ నగర్, అహమ్మద్ నగర్, కింగ్స్ ఎవెన్యూ, యూసఫ్ గుల్షన్ కాలనీ, గ్రీన్ విచ్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో సాయంత్రం నాలుగు గంటల నుండి 5 గంటల వరకు క్రిస్టల్ టౌన్, రహమత్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

### ఇబ్రహీంబాద్ సెక్షన్లో..

ఇబ్రహీంబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం సాయంత్రం నాలుగు గంటల నుండి నాలుగున్నర వరకు శ్రీరామ్ కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, హనుమాన్ నగర్ విజేత బ్యాక్ సైడ్, లాలమ్మ గార్డెన్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడున్నర నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు సెక్రటేరియట్ కాలనీ, లాలమ్మ గార్డెన్, బతుకమ్మ పార్క్

### పంచవటి విద్యుత్ ఫీడర్ పరిధిలో...

శనివారం సాయంత్రం నాలుగున్నర నుండి ఐదు గంటల వరకు పంచవటి కాలనీ, తులజీరాం విద్యుత్ ఫీడర్ పరిధిలో సాయంత్రం ఐదు గంటల నుండి 5:30 వరకు గో గ్రీన్ కాలనీ, తులసి రామ్ టెంపుల్ బ్యాక్ సైడ్, అల్కాపూర్ రోడ్ నెంబర్ 23 ,25, 26 ,27 ,28, 29, 30, 16, ఓల్డ్ అల్కాపూర్ విద్యుత్ లీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుండి 9:30 వరకు అల్కాపూర్ రోడ్ నెంబర్13 , కుతుబ్ సాహి కాలనీ, పెంటయ్య నగర్ కాలనీ, స్కైలా అపార్ట్మెంట్, వినాయక నగర్ ఫేస్ -2, లాంకో విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడున్నర నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అల్కాపూర్ రోడ్ నెంబర్ 3 నుండి 13 వరకు, పుప్పాలగూడ విద్యుత్ పీటర్ పరిధిలో మధ్యాహ్నం 3:30నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పుప్పాలగూడ గ్రామం, మారుతి నగర్, దుర్గా నగర్, రాఘవేంద్ర కాలనీ, గోల్డెన్ ఓరియన్, మానస అపార్ట్మెంట్, ఎల్ఐసి కాలనీ, అల్కాపూర్ రోడ్ నెంబర్ 8, జన చైతన్య విద్యుత్ లీడర్ పరిధిలో ఉదయం 9:30 నుండి 10 గంటల వరకు హనుమాన్ నగర్, నాగేశ్వరరావు వెంచర్, ఎంప్లాయిస్ కాలనీ, తిరుపతమ్మ ట్రాన్స్ఫార్మర్, శ్రీ హెూమ్స్, లంచం ఎటానియా ఫీడర్ పరిధిలో సాయంత్రం నాలుగు గంటల నుండి నాలుగున్నర వరకు లంచం ఎటానియా, శంకర్ ఐ హాస్పిటల్, జయభేరి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ కే సంతోష్ కుమార్ తెలిపారు.

### నార్సింగి విద్యుత్ సెక్షన్ లో...

నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం శనివారం ఉదయం 9 నుండి 9:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మణికంఠ తెలిపారు. గండిపేట, శ్రీనగర్, గ్రే హెూమ్స్ , మార్కెట్ యార్డ్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో సాయిబాబా టెంపుల్ విద్యుత్ పీటర్ పరిధిలో సాయంత్రం నాలుగున్నర నుండి ఐదు గంటల వరకు, గిరి గడ్డ, నార్సింగి విలేజ్, ముప్పా విలాస్, ముప్పా అలేఖ్య, బాలాజీ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో సాయంత్రం నాలుగున్నర నుండి ఐదు గంటల వరకు మంచి రేవుల, మంతి విల్లాస్, గ్రీన్ ల్యాండ్, జై హిందూ కాలనీ, కోకాపేట్ విద్యుత్ సెక్స్ స్టేషన్ పరిధిలో బాబు ఖాన్ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుండి 10 గంటల వరకు 250 యాడ్స్, గోల్డెన్ మాల్, బాబు ఖాన్ విల్లాస్, గ్రాండ్ ఇన్ఫ్రాటెక్ విల్లాస్, దంతు స్వీట్ హౌస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మణికంఠ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.





జమ్ము కాశ్మీర్ లోని పాహాల్గాం లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తు రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షులు వేముల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్ ల ఆధ్వర్యంలో శు క్రవారం సాయంత్రం రాజేంద్రనగర్ లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.అమరేందర్, నవజ్యోతి యూత్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పి.ఈశ్వర్, వివిధ పార్టీల నాయకులు ఎం.యాదమ్మ యాదవ్. దుంబాల ఝాన్సీరెడ్డి, పి.ఉమా మహేశ్వరీ, ఎం.శ్రీకాంత్, యువజన సంఘాల నాయకులు ఎస్.గంగాధర్, ఎం.శ్రీనివాస్, ఎన్.వెంకటేశ్ తో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

బుద్వేల్, ప్రభాత ఉదయం



జోగు నరసింహా భౌతిక కాయం వద్ద వనం నరసింహ మాదిగ, పోతురాజు యాదయ్య మాదిగలు



జోగు నరసింహా భౌతిక కాయం వద్ద క్యాసారం శంకర్ రావు మాదిగ, జోగు శేఖర్ మాదిగ, గడ్డం సామెల్ మాదిగ



జోగు నరసింహ



జోగు నరసింహా భౌతిక కాయం వద్ద కాంగ్రెస్ నేత కోరని బాల్ రాజ్ తదితరులు



మంద కృష్ణ మాదిగ తో జోగు నరసింహా

# ఎమ్మార్పీఎస్ నాయకుడు జోగు నర్సింహ్మా అనారోగ్యంతో మృతి

బుద్వేల్, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కోసం పోరాడిన తొలి తరం నాయకుడు, గగన్ పహడ్ వాస్తవ్యులు జోగు నర్సింహ్మా(59) అనారోగ్యంతో బాధపడుతు శుక్రవారం మద్యాహ్నం మరణించారు. ఆయనకు భార్య లలిత, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమెర్తెలు ఉన్నారు. ఎమ్మార్పీఎస్ ఉ ద్యమంలో చురుకైన నాయకుడుగా పనిచేస్తు, మంద క్రిష్ణ మాదిగ ఏ పిలుపు ఇచ్చిన ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ముం దుండి పనిచేశారన్నారు. ఎం ఆర్ పీ ఎస్ ఉద్యమంలో జోగు నర్సింహ్మా జైలుకు కూడా వెళ్లి వచ్చారన్నారు. జోగు నర్సింహ్మా మాదిగ మరణవార్త గురించి తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వనం నర్సింహ్మా మాదిగ, క్యాసారం శంకర్ రావు మాదిగ, మద్దిలేటి మాదిగ, పోతురాజు యాదయ్య మాదిగ , ననాగారి రాంచందర్ మాదిగ , జోగు శేఖర్ మాదిగ తో పాటు వివిధ పార్టీ నాయకులు కోరని బాల్ రాజ్, జోగు రవి. తలారి అశోక్, తలారి శ్రీశైలం లతో పాటు పలువురు నాయకులు గగన్ పహడ్ కు చేరుకుని జోగి నర్సింహ్మా భౌతిక కాయంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. జోగు నర్సిం హ్మా మాదిగ అంత్యక్రియలు శనివారం గగన్పహడ్ రైల్వే ట్రాక్ పక్కన గల వెంకన్న గూడెంలో నిర్వహించడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

# పహల్గాం దాడి ఘటన బాధకరం




ఉగ్ర దాడిని నిరసిస్తూ హపీ హెూమ్స్ కాలనీ లోని ఘుడా బేగ్ మసీదు ఆవరణలో నినాదాలు చేస్తున్న ముస్లిం సోదరులు

### పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తున్నాం : నల్ల బ్యాడ్జీలతో ముస్లింల నిరసన.. సర్ఫరాజ్ సిద్ధిఖీ,సయ్యద్ హిదాయతుల్లా షఫీ

బుద్వేల్, ఏప్రిల్ 25(ప్రభాత ఉదయం): జమ్మూ కాశ్మీర్లోని పహల్గాంలో టూరిస్టులపై జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నమనీ ఎంఐఎం పార్టీ నాయకులు సర్ఫరాజ్ సిద్ధిఖీ,జన చైతన్య ఘుడా బేగ్ మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా షఫీ,లు తెలిపారు.శుక్రవారం రాజేంద్రనగర్ డివిజన్ జన చైతన్య మసీదులో మధ్యాహ్నం నమాజ్ సమయంలో పహల్గామ్ ఘటనలో మరణించిన వారి ఆత్మశాంతి కోసం ప్రార్థించారు.ప్రజాస్వామ్య భారతదేశంలో హింస వాదానికి తావు లేదని,ఉగ్ర మూకల చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు.ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్ఫరాజ్ సిద్ధిఖీ,సయ్యద్ హిదాయతుల్లా షఫీ,లు మాట్లాడుతూ ...సామాన్యులపై ఉగ్రదాడి పిరికిపంద చర్యగా అభివర్ణించారు.ఉ గ్రవాదులను వారి హింసాత్మక చర్యలను యావత్ భారతదేశం ముక్తకంఠంతో ఖండిస్తోందనారు.దాడులతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని తగ్గించలేరన్నారు.ఇలాంటి చర్యలకుపాల్పడుతున్న వారిని బహిరంగంగా కఠినాతి కఠినంగా శిక్షించాలని కలలో కూడా ఇలాంటి చర్యలు పాల్పడాలంటే వెన్నులో వణుకు పుట్టే విధంగా శిక్ష అమలు చేయాలన్నారు.కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాద దాడిని భారతదేశాన్ని మాత్రమే కాకుండా యావత్ ప్రపంచాన్ని కుదిపేసింది.ఈ దాడిలో చాలా మంది పర్యాటకులు చనిపోయారు.అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఉగ్రవాదానికి మతం ఉండదనిచిన్న చీమకు కూడా హాని తలపెట్ట వద్దని ఇస్లాం చెప్తుంది అన్నారు.ప్రభుత్వం ఉ గ్రవాదంపై తీసుకునే ఎలాంటి చర్య అయినా సరే మా మద్దతు ఉంటుంది.మానవత్వం ఉన్నవారు ఎవరైనా సరే ఈ హేయమైన చర్యను ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు.భారత ప్రభుత్వం ఉ గ్రవాదాన్ని ఉక్కు పాదంతో అణిచివేసే చర్యలకు పూనుకోవాలనారు.భారతదేశంలో ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు ఉగ్రవాదులు ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని,అటువంటి వారిని ప్రభుత్వం పట్టుకొని కఠినంగా శిక్షించాలని తెలిపారు. ఈ దుర్ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వారికి భగవంతుడు మనోధైర్యాన్ని శక్తిని కల్పించాలని,గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.



నల్ల రిబ్బన్ లు కట్టుకుని నిరసన తెలుపుతున్న మజ్లిస్ అధ్యక్షులు, హైదరా బాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ

## ఉగ్ర దాడులను ఖండిస్తు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, తదితరులు


బుద్వేల్, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం): జమ్ము కాశ్మీర్ లోని పాహాల్గాం ఉగ్రదాడులను మజ్లిస్ అధ్యక్షుడు, హైదారాబాద్ ఎంపీ అనదుద్దీన్ ఓవైసీ ఖండించారు. శాస్త్రీపురం లో శుక్రవారం జరిగిన జుమ్మా ప్రార్థనలకు ఆయన నల్ల బ్యాడ్జీలను ధరించి ప్రార్థనలలో పాల్గొన్నారు. ఆయన వెంట కవర్ లో తీసుకువచ్చిన నల్ల రిబ్బెన్లను నమాజు ల కోసం వచ్చే ముస్లిం సోదరులకు అందజేసి ఉగ్రదాడులను నిరసిస్తు నల్ల బ్యాడ్జీలను ధరించి ప్రార్థనలలో పాల్గొనాలని సూచించారు.



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అధికారులు

## వ్యవసాయంలో కృత్రిమ మేధ వినియోగంపై బిట్స్ ఫిలానీ - ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందం

బుద్వేల్, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం) వ్యవసాయం లో కృత్రిమ మేధ వినియోగంపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బిట్స్ ఫిలానీ ల మధ్య శుక్రవారం ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. రాజేంద్రనగర్ లోని అగ్రిహబ్ లో ఈ కార్యక్రమం జరిగింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, బిట్స్ ఫిలానీ ఉప కులపతి ప్రొఫెసర్ వి.రాంగోపాల్ రావు సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల అధికారులు సంతకాలు చేశారు. పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ రెండు ప్రతిష్టాత్మకమైన సంస్థల మధ్య జరిగిన ఈ అవగాహన ఒప్పందం సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పనకు పీహెచ్డీ విద్యార్థులకు పరిశోధన సలహాలు ఇవ్వడానికి దోహదం చేస్తు ందని బిట్స్ ఫిలానీ ఉ పకులపతి ప్రొఫెసర్ వి.రాంగోపాల్ రావు అన్నారు. ఇరు సంస్థల శాస్త్రవేత బిలు కలసి నాణ్యమైన పరిశోధన పత్రాలు ప్రచురించడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. దుబాయ్ తో పాటు నాలుగు చోట్ల బిట్స్ క్యాంపస్ లున్నాయని, అందులో ప్రతి ఏటా సుమారు 600 మంది పీహెచ్డీ లో ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు. దేశంలోనే మూడవ అత్యంత ప్రతిష్టాత్మకమైన స్టార్టప్ నెట్వర్క్ బిట్స్ ఫిలానీ సంస్థకు ఉందని తెలిపారు. అధునిక టెక్నాలజీని వినియోగించి రైతులకు మెరుగైన సేవలను అందించడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందని వివరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, దేశంలోనే అత్యంత ప్రాచీన వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండోదని, ఇది అమెరికా ల్యాండ్ గ్రాంట్ మోడల్ లో ఏర్పాటయ్యిందని తెలిపారు. గ్రామీణ స్థాయి వరకు అత్యంత పటిష్టమైన పరిశోధన నెట్ వర్క్ కలిగి ఉండటంతో పాటు అనేక వ్యవసాయ విధ్య, విస్తరణ సంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా కలిగి ఉండి రైతులకు మెరుగైన సేవలు అందించడానికి నిమగ్నమైనదన్నారు. 2047 నాటికి మానవ రహిత వ్యవసాయం తీసుకురావాలనే లక్ష్యంతో తాము ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. అందుకోసం డిజిటల్ అగ్రికల్చర్ కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. బిట్స్ ఫిలానీ తో జరిగిన ఈ అవగాహన ఒప్పందం వల్ల తాము అనుకున్న మానవ రహిత వ్యవసాయ లక్ష్యాలను సాదించడానికి అవకాశం కలుగుతుం దన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ పరిజ్ఞానం ( హార్డ్వేర్) బిట్స్ ఫిలానీలోని సాఫ్ట్ వేర్ కలిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. పత్తి, వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటల సాగుకు ఉపయోగపడే అగ్రి రోబోల రూపకల్పన జరగాలని ప్రొఫెసర్ జానయ్య ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం.బలరాం, రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్, బిట్స్ ఫిలానీ డీన్ అఫ్ రీసెర్చ్ అం డ్ ఇన్నోవేషన్ డాక్టర్ సంజీత్ గోయల్, వ్యవసాయ వర్శిటీ అంతర్జాతీయ కార్యక్రమాల సం చాలకులు డాక్టర్ రాములు, డిజిటల్ అగ్రికల్చరల్ విభాగం సంచాలకులు డాక్టర్ బాలాజీ నాయక్, విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, బిట్స్ ఫిలానీ సంస్థ అధికారులు పాల్గొన్నారు.




నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ కార్యాలయం

## నేడు స్నాతకోత్సవం

బుద్వేల్, ఏప్రిల్ 25 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ మేనేజ్మెంట్ (నార్మ్) లో ఈ నెల 26న ఉదయం 10 గంటలకు పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్మెంట్ ( అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్) కోర్సు యొక్క 5వ స్నాతకోత్సవం నిర్వహించనున్నట్లు నార్మ్ ప్రజా సంబంధాల అధికారిణీ గుత్తికొండ అనీజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీఏఆర్ విశ్రాంత డైరెక్టర్ జనరల్, పద్మభూషన్ డాక్టర్ ఆర్ ఎస్ పరోడా ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. గౌరవ అతిథిగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ గోద్రెజ్ ఆగ్రోనెట్ లిమిటెడ్ సీఈఓ ఎస్ కె రాజవేలు, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగిలాల్ జాట్ లు హాజరౌతారన్నారు. 2021, 2022, 2023 బ్యాచ్ లకు చెందిన 176 మంది విద్యార్థులకు డి ప్లోమా లు బహుకరించడం జరుగుతుందన్నారు.

ఉదయం తెలుగు దినపత్రిక

# కిరణ్ అబ్బవరం 'క' సినిమాకు అరుదైన ఘనత

## ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌కు నామినేట్



టాలీవుడ్ యువ నటుడు కిరణ్ అబ్బవరం అరుదైన ఘనతను అందుకున్నాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన సూపర్ హిట్ చిత్రం 'క' 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌కు నామినేట్ అయింది. ఉత్తమ చిత్రం విభాగంలో ఈ చిత్రం నామినేట్ అయినట్లు సదరూ సంస్థ ప్రకటించింది. ఢిల్లీ వేదికగా ఈ నెలాఖారున జరుగనున్న వేడుకల్లో విజేతలకు పురస్కారాలు అందించనున్నారు. చిన్న సినిమాగా వచ్చి గతేడాది అక్టోబర్ 31న బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది 'క' చిత్రం. కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు సుజీత్, సందీప్ ఇద్దరు దర్శకులు సంయుక్తంగా దర్శకత్వం వహించగా.. కిరణ్ అబ్బవరం సోంత బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమాను చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మించారు. నయన్ సారిక కథానాయికగా నటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఓ జైలు లాంటి చీకటి గదిలో కథ మొదలవుతుంది. ఆ గది మధ్య ఓ టేబుల్. దానికి అటుఇటు కూర్చోడానికి రెండు కుర్చీలు. ఆ టేబుల్‌పై గడియారాన్ని పోలిన ఓ యంత్రం. నడినెత్తిపై లైట్.. ఇది సెటప్. హీరో వాసుదేవ్(కిరణ్ అబ్బవరం) ఆ గదిలో బంధించి ఉంటాడు. తనెందుకు అక్కడ బంధింపబడ్డాడో తనకి అర్థం కావడంలేదు. ఇంతలో ఓ ముగ్గురు ముసుగు మనుషులు ఆ గదిలోకి ప్రవేశించారు. వారిలో మధ్యలోని ముఖ్యమైన వాడు వాసుదేవ్‌ని ఇంటరాగేట్ చేయడం మొదలుపెట్టాడు. 'అసలు 1977లో నువ్వు కృష్ణగిరి గ్రామంలోకి ఎందుకు ప్రవేశించావ్?' అనడిగాడు. వాసుదేవ్ చెప్పనని మొరాయించాడు. టేబుల్ మీదున్న గడియారంలాంటి యంత్రం గిర్రున తిరిగింది. దాని నుంచి వెలువడిన శక్తివల్ల వాసుదేవ్ నిదానంగా హిప్నటయిజ్ అయ్యాడు. చెప్పడం మొదలుపెట్టాడు. 1960ల్లో కథ మొదలైంది. వాసుదేవ్‌కి అప్పుడు పదేళ్లు ఉంటాయి. తనో అనాథ, అనాథ శరణాలయంలో బతుకుతుంటాడు. 'నా' అన్నవాళ్లు లేకపోవడంతో ఇతరులకు వచ్చిన ఉత్తరాలు చదవే చెడ్డబుద్ధిని అలవాటు చేసుకుంటాడు. ఇతరులకు వారి బంధువులు రాసిన ఉత్తరాలు చదువుతూ, తనకే ఆ ఉత్తరాలు వచ్చినట్టు ఫీలవుతుంటాడు. ఈ ఆనందం రోజూ ఉండాలని, తనో పోస్ట్‌మ్యాన్ కావాలని నిశ్చయించుకుంటాడు. ఆ అలవాటులో భాగంగా శరణాలయం వార్డెన్ ఉత్తరం చదువుతూ వార్డెన్‌కి దొరికిపోతాడు. అతను వాసుదేవ్‌ని కొట్టి, మందలించి వదిలిపెట్టేస్తాడు. ఓ రోజు వార్డెన్ దగ్గరున్న డబ్బును దొంగిలించి, శరణాలయం నుంచి పారిపోతాడు వాసుదేవ్. తన కూతురు ఆపరేషన్‌కోసం వార్డెన్ దాచుకున్న డబ్బు అది. ఆ డబ్బు పోవడంతో వార్డెన్ షాక్‌కి గురవుతాడు. ఆపరేషన్ జరగకపోవడంతో అతని కూతురు చనిపోతుంది. ఇవేమీ పారిపోయిన వాసుదేవ్‌కి తెలీదు. తాను ఆ డబ్బుతో వేరే ఊరు చేరుకొని తన ఆశయసాధన కోసం టెన్త్ వరకూ చదువుపూర్తి చేస్తాడు. కృష్ణగిరి అనే ఊళ్లో అసిస్టెంట్ పోస్ట్‌మ్యాన్ ఉద్యోగం ఖాళీగా ఉందని తెలిసి, ఆ ఊరు చేరుకుంటాడు. ఇక అక్కడ ఎదురైన పరిణామాలేంటి? అసలు వాసుదేవ్ ఆ జైల్లో ఎందుకు పడ్డాడు? అతడ్ని ఇంటరాగేట్ చేస్తున్న వాళ్లు ఎవరు? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ.

### చిన్న సినిమాలకు అండగా

# ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్



అభిరుచి గల నిర్మాతగా పేరుపొంది, 'బేబీ' లాంటి కల్ట్ బ్లాక్‌బస్టర్‌ను అందించి మరోసారి తన జడ్జిమెంట్‌ను నిరూపించుకున్న నిర్మాత ఎస్‌కేఎన్. స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగిన ఈ నిర్మాతకు చిన్న సినిమాలంటే అమితమైన ప్రేమ, గౌరవం. పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమా కూడా విజయం సాధించాలని ఆయన ఎప్పుడూ కోరుకుంటాడు. వీలున్నంత వరకు చిన్న సినిమా ప్రమోట్ అవ్వడానికి తన వంతు సహాయం అందిస్తుంటాడు. ఇప్పుడు ఈ కోవలోనే ఇటీవల సంపూర్ణేష్ బాబు, సంజోష్‌లు హీరోలుగా నటించిన సోదరా ట్రైలర్ విడుదల వేడుకకు అతిథిగా హాజరైన ఎస్‌కేఎన్, ఈ చిత్రం ఓ స్పెషల్ ప్రీమియర్‌ను తను సొంతంగా థియేటర్ బుక్ చేసుకుని, తన స్నేహితులకు, శ్రేయోభిలాషులకు ఈ సినిమా చూపిస్తానని మాటిచ్చాడు. అయితే సాధారణంగా సినీ పరిశ్రమలో మాట మీద నిలబడటం చాలా తక్కువగా ఉంటుందని, ఒకవేళ ఏదైనా సపోర్ట్ చేస్తామని చెప్పిన అది ప్రకటనల వరకు పరిమితం అవుతుందనే అపోహ కొందరిలో ఉంటుంది. అయితే ఎస్‌కేఎన్ మాత్రం తను ఒక సారి మాట ఇస్తే తప్పకుండా నేరవేరుస్తుంటాడు. ఈ కోవలోనే ఎస్‌కేఎన్ సోదరా చిత్రం స్పెషల్ ప్రీమియర్‌ను తన సొంత ఖర్చుతో ఈ రోజు అనగా గురువారం ఏప్రిల్ 24న సాయంత్రం ఏషియన్ అల్లు అర్జున్ '(ఎఎఎ) మల్టీప్లెక్స్ థియేటర్‌లో ఏర్పాటు చేశాడు. సోదరా చిత్రాం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. సాధారణంగా ఎస్‌కేఎన్ ఎవరికైనా ఆపద ఉందని తెలిసినా ఆర్థికంగా ఆదుకున్న సందర్భాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమలోని ప్రతి హీరో అభిమానులకు కూడా వారికి ఏదైనా ఆపద ఉంటే ట్విట్టర్‌లో స్పందించి వారిని ఆదుకున్న ఘటనలు కూడా ఉన్నాయి.



## పాన్ ఇండియా సినిమా చేసేందుకు బిగ్ స్కెచ్

లైగర్, డబుల్ ఇస్మార్ట్ మూవీలతో కెరీర్ లో డీలా పడిన డైరెక్టర్ పూరి జగన్నాథ్ కమ్ బ్యాక్ కోసం చాలా ప్రయత్నం చేస్తున్నాడు. నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసం చాలా రోజులుగా.. చాలా మంది హీరోల చుట్టూ తిరిగి అలసిపోయిన పూరీ.. చివరికి మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి తో మూవీని ఓకే చేయించుకున్నాడు. తెలుగులో కాకుండా పాన్ ఇండియా లెవెల్ సినిమా చేసేందుకు ఓ బిగ్ స్కెచ్ వేస్తున్నాడు పూరి. తాజాగా ఈ మూవీకి ఇంట్రెస్టింగ్ టైటిల్ ను పెట్టి అప్పుడే కావాల్సినంత బజ్ ను క్రియేట్ చేసుకున్నాడు. విజయ్ సేతుపతి వంటి నటుడితో పూరి ఎలాంటి కథను అందిస్తారనే దానిపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పూరి సొంత నిర్మాణ సంస్థ 'పూరీ కనెక్ట్స్' బ్యానర్‌పై ఈ సినిమా రూపొందనుందని, ఎప్పటిలాగే ఛార్మి కౌర్ నిర్మాతగా వ్యవహరించనుంది. అయితే ఈ మూవీకి 'బెగ్గర్' అనే టైటిల్ ను లాక్ చేసినట్లు ఓ న్యూస్ చక్కర్లు కొడుతోంది. ఈ మూవీలో విజయ్ సేతుపతి బిచ్చగాడిగా కనిపించనున్నాడట. అందుకే ఈ టైటిల్ ను పెట్టినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాతో పాత పూరి బయటకు వచ్చేలా అదిరిపోయే స్క్రిప్ట్ తో వచ్చేస్తున్నాడట. సేతుపతి కోసం బాలీవుడ్ నటి టబు తో పాటు రాధిక ఆప్టే ను రంగంలోకి దింపుతున్నారు. ఇప్పటికే స్టోరీ లాక్ అవ్వడంతో సెట్స్ పైకి తీసుకెళ్లాలని ప్లాన్ చేస్తున్నారు. మామూలుగానే పూరీ సినిమా అంటే జెట్ స్పీడ్ గా సాగుతుంది. మూడు నాలుగు నెలల్లోనే సినిమాను కంప్లీట్ చేస్తాడు. ఇప్పుడు విజయ్ సేతుపతితో చేయనున్న సినిమాకు కూడా ఆ పార్ములానే అప్లై చేయనున్నాడు. జూన్‌లో సెట్స్ పైకి తీసుకెళ్లి కేవలం 60 రోజుల్లోనే సినిమాను ఫినిష్ చేయాలనుకుంటున్నాడట. ఇటు విజయ్ సేతుపతి సైతం సినిమాను ఫాస్ట్ గా పూర్తి చేయాలని సూచించాడట. దీంతో నాన్ స్టాప్ గా షూటింగ్ జరపనున్నట్లు తెలుస్తోంది. అంతేకాక ఓ మురికివాడ సెట్ ను వేయాలనుకుంటున్నారట. ఈ సెట్ వర్క్ కంప్లీట్ అవ్వగానే... షూటింగ్ మొదలు కానున్నట్లు తెలుస్తోంది. మరి విజయ్ సేతుపతితో పూరి సినిమా కొత్త ఊపిరి పోస్తుందో లేదో అనేది చూడాలి.

# అతనితో నాది ప్రత్యేక బంధం



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల సినిమాల కన్నా కూడా ఇతర విషయాలతో ఎక్కువగా వార్తలలో నిలుస్తూ వస్తుంది. మయోసైటిస్ వలన సినిమాలు కాస్త తగ్గించిన సమంత సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన పర్సనల్, ప్రొఫెషనల్ కి సంబంధించిన పలు విషయాలు పంచుకుంటూ ఉంటుంది. అలానే ఇంటర్వ్యూలలో ఆసక్తికర విషయాలు తెలియజేస్తూ ఉంటుంది. తాజాగా కోలీవుడ్‌లో జరిగిన గోల్డెన్ క్వీన్ అవార్డుల కార్యక్రమంలో ప్రముఖ నటి సమంత గోల్డెన్ క్వీన్ పురస్కారాన్ని అందుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె తన సినీ ప్రయాణం, వ్యక్తిగత అనుభవాల గురించి మాట్లాడింది. అలానే దర్శకుడు,నటుడు రాహుల్ రవీంద్రన్‌తో తనకి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, ఆయన తనకు అండగా నిలిచిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. తనకు ఆరోగ్యం బాగాలేని క్లిష్ట సమయంలో రాహుల్ రవీంద్రన్ అండగా నిలిచాడని సమంత చెప్పుకొచ్చింది. లేచిన దగ్గర నుండి సాయంత్రం వరకు రాహుల్ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా బంధానికి పేరు పెట్టలేను. స్నేహితుడా, సోదరుడా, కుటుంబ సభ్యుడా అనేది చెప్పలేను అంటూ రాహుల్‌పై తనకున్న అభిమానాన్ని వ్యక్తపరిచింది సమంత. ఇక అభిమానుల సపోర్ట్ నాకు ఎప్పుడు ఉంటుందని, అది నా అదృష్టం, హార్ట్ వర్క్, లక్ వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. ఇక మనం తీసుకునే ఒక్క నిర్ణయాన్ని బట్టి కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. తెలిసీ, తెలియక తీసుకునే ఎన్నో నిర్ణయాలు మన ప్రయాణంపై ప్రభావం చూపుతాయి అని సమంత పేర్కొంది. ఇక దర్శకురాలు సుధ కొంగర.. సమంతపై ప్రశంసలు కురిపించింది సమంత. గత ఐదేళ్లుగా ఆమెను దగ్గర నుంచి చూస్తున్నానని,ఆమె కష్టాలు చూసి కన్నీళ్లు వచ్చేవని, ఎంతోమంది అమ్మాయిలకు సమంత స్ఫూర్తి అని అన్నారు ఆమె నటించిన 'ఊ అంటావా..' పాట నాకెంతో ఇష్టం" అని సుధ కొంగర చెప్పుకొచ్చారు. ఇక అదే సమయంలో నాకు యాక్షన్ ఫిల్మ్ చేయాలనే ఆసక్తి ఉందని అనడంతో, తప్పకుండా మనం ఒక యాక్షన్ ఫిల్మ్ చేద్దాం అంటూ సుధ కొంగర హామీ ఇచ్చారు



### 'కలియుగమ్-2064'

# ట్రైలర్ రిలీజ్

శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్ ప్రధానపాత్రల్లో నటించిని తాజా చిత్రం 'కలియుగమ్-2064'. తమిళ, తెలుగు భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రమోద్ సుందర్ దర్శకత్వం వహించగా.. ఆర్.కె. ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కె.ఎస్. రామకృష్ణ నిర్మించారు. మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. 2064లో ఈ సినిమా కథ జరగబోతున్నట్లు తెలుస్తుంది. భవిష్యత్తులో మానవులు ఎలా జీవిస్తారు, ఎలా బతుకుతారు, ఎలా మరణిస్తారు అనే అంశాల చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231.** Cell:9391089608